క్లుప్తంగా

ఆట పాటలతో అంగన్‌వాడీ విద్య



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీడీపీఓ తులసి

బుట్టాయగూడెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఇ.తులసి తెలిపారు. మండలంలోని కొమ్ముగూడెం అంగన్‌వాడి కేంద్రాన్ని సీడీపీఓ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా తక్కువ బరువు ఉన్న పిల్లల ఎత్తు, బరువులను ఆమె స్వయంగా పరిశీలించారు. అలాగే కేంద్రానికి సప్‌లై అయ్యే గుడ్ల నాణ్యతను పరిశీలించారు. అనంతరం తులసి మాట్లాడుతూ పిల్లలలో చిన్న వయస్సు నుంచే సరైన ఎదుగుదల ఉండేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్త నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

బయ్యనగూడెంలో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కొయ్యలగూడెం: బయ్యనగూడెం పీహెచ్‌సీ పరిధిలో గురువారం ప్రజలకు వైద్యులు ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన వారికి రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేటి సమాజంలో అసంక్రమణ వ్యాధులైన బీపీ, డయాబెటిస్ చాలా ప్రమాదకరంగా పెరిగి పోతున్నాయని, వీటిని సకాలంలో గుర్తించి, చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్‌కే బాషా, ఎమ్‌యల్‌హెచ్‌పీటీ రవితేజ, ఏఎన్ఎంలు పద్మావతి, నాగమణి, ఆరోగ్య సహాయకులు మోహన్, ఆశా కార్యకర్తలు జగతి, శాంత కుమారి, పద్మ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీసీ పంకజ్

కుక్కునూరు: మండలంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలోని హాస్టల్ విద్యార్థులకు గురువారం ఏపీసీ, జీసీడీఓల ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఇటీవల కలెక్టర్ వెట్రిసెల్వి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ ఏజెన్సీ ప్రాంతంలో హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులకు ప్రిపరేషన్ నిమిత్తం నోట్ పుస్తకాలు కావాలని అడగడంతో స్పందించిన కలెక్టర్ ఏపీసీ పంకజ్, జీసీడీఓ నవీనలతో 500 మంది విద్యార్థులకు సరిపడా నోట్ పుస్తకాలను అందించారు. అనంతరం ఏపీసీ, జీసీడీఓలు కుక్కునూరు, వేలేరులోని కేజీబీవీ పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు శ్రీహరి, సుశీల పాల్గొన్నారు

తిరుపతి ఘటనపై విచారణ చేయాలి

బుట్టాయగూడెం: కలియుగ దైవం తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి భక్తులు మృతి చెందిన సంఘటనపై సమగ్ర విచారణ చేయించాలని దళిత సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తగరం రాంబాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చైర్మన్ నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందన్నారు. అలాగే దేవాదా యశాఖ, హోంమంత్రి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి తొక్కిసలాటలో మృతి సంఘటన బాధాకరమని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు రూ.25 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

జంగారెడ్డిగూడెం: ఛత్రపతి శివాజీ త్రిశత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, భౌతికశాస్త్రం, కంప్యూటర్స్, గణితశాస్త్రం, వృక్షశాస్త్ర విభాగాల నుంచి విద్యార్థులను క్షేత్ర పర్యటనకు అధ్యాపకులు గురువారం తాడువాయి షుగర్ ఫ్యాక్టరీ తీసుకెళ్లారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్పత్తి, ప్యాకింగ్, సరఫరాలకు సంబంధించిన అనేక విషయాలను క్షేత్ర పర్యటన చేస్తూ క్షేత్ర సిబ్బంది నుంచి సమాచారం తెలుసుకుంటారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇలాంటి క్షేత్ర పర్యటనలు ఖచ్చితంగా నిర్వహించాలని, విద్యార్థులు చదువుతో పాటు ఆచరణాత్మక జ్ఞానం నేర్చుకోవాలని, విద్యార్థులు క్షేత్ర పర్యటన చేయటం వల్ల షుగర్ ఫ్యాక్టరీ యొక్క పరిసరాలు ఉత్పత్తి అమ్మకాలు అకౌంటింగ్ విభాగాలు ఉపయోగించే అకౌంటింగ్ విధానాలపై స్వతహాగా అవగాహన వస్తుందని అన్నారు.

ఆద్యంతం.. ఆధ్యాత్మికం

అట్టహాసంగా శ్రీవారి గిరి ప్రదక్షిణ వేడుక

ద్వారకాతిరుమల: శ్రీవారి గిరి ప్రదక్షిణ వేడుక ఆద్యంతం భక్తులకు కనువిందు చేసింది. వేలాదిగా పాల్గొన్న భక్తజనులతో క్షేత్రం పులకించింది. ఎటు చూసినా భక్తజన సంద్రమే.. ఏ నోట విన్నా గోవింద నామస్మరణలే వినిపించాయి. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, గజ, అశ్వ, వృషభ సేవలు నడుమ గురువారం సాయంత్రం ఈ వేడుక అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రధాన కూడలిలో సుగంధ భరిత పుష్ప మాలికలతో శోభాయమానంగా అలంకరించిన శేష వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించారు. ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావులు శేష వాహనంపై కొలువైన చిన వెంకన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శేష వాహన రథంతో పాటు, స్వామి వారి ధర్మ ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. పాదయాత్రగా ఐదు కిలోమీటర్ల మేర గిరి చుట్టూ తిరిగారు. ఈ గిరి ప్రదక్షిణ యాత్ర క్షేత్రం నుంచి దొరసానిపాడు, రాళ్లకుంట రహదారి గుండా కొండపైకి, అక్కడి నుంచి ఉగాది మండపం మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది.



గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఈఓ త్రినాథరావు, ధర్మకర్త నివృతరావు



మహిళల కోలాట ప్రదర్శనలు



శ్రీనివాసుడి వేషధారణలో..



కేరళ వాయిద్యాలు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ కార్యకర్త, కొయ్యలగూడెం పట్టణ యూత్ లీడర్ ఏలేటి భాస్కర్‌కి గురువారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల భాస్కర్ అనారోగ్యానికి గురి కావడంతో యువజన నాయకుడు నూకల రాము ద్వారా విషయం తెలుసుకొని ఆర్థిక సాయాన్ని రాము ద్వారా భాస్కర్‌కి పంపించారు. భాస్కర్ పూర్తి ఆరోగ్యవంతుడు కావడానికి తనవంతు కృషి చేస్తానని బాలరాజు హామీ ఇచ్చారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



పట్టుబడిన సారా, మహిళతో ఎక్సైజ్ అధికారులు

చింతలపూడి: ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రేచర్ల గ్రామంలో సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. దాడుల్లో రేచర్ల గ్రామానికి చెందిన మద్దిరసు లక్ష్మీదేవి అనే మహిళను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. మండలంలోని రేచర్ల, నాగిరెడ్డిగూడెం గ్రామాల్లో పాత సారా కేసుల్లో నిందితులైన ఎం.లక్ష్మీదేవి, వడిత్య లక్ష్మణుడులను సెక్షన్ 129 చట్టం ప్రకారం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మాయి చదువు అవనికి వెలుగు



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

కొయ్యలగూడెం: అమ్మాయి చదువు అవనికి వెలుగునిస్తుందని చాటి చెప్పిన సంఘ సంస్కర్త, విద్యావేత్త, సామాజిక కార్యకర్త తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా అని బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలగల దుర్గారావు అన్నారు. గురువారం పరింపూడి ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో ఫాతిమా 194వ జయంతి కార్యక్రమం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుజాత, తాడిగడప ఆంజనేయరాజు, పంది ప్రభుదాసు, సూరి గంగాధర్ రాజు, గడ్డం రాంబాబు పాల్గొన్నారు.

కూత పెడుతున్న పందెం కోళ్లు

- డెల్టాకు దీటుగా మెట్టలో పందేలకు ఏర్పాట్లు
- యుద్ధానికి సిద్ధం.. పంతం నీదా నాదా ?

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో సంక్రాంతి బరిలో దూకడానికి పందెం కోళ్లు కూత పెడుతున్నాయి. సంక్రాంతి రాక ముందే గ్రామాల్లో అక్కడక్కడా పందేలు జోరందుకున్నాయి. ప్రతీ ఏడాది లాగే ఈ ఏడు కూడ రాజకీయ నాయకుల వత్తిళ్ళతో కోడి పందాలకు అనుమతులు వస్తాయని పందెంగాళ్ళు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఒక పక్క జిల్లాలో పోలీసులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ కోడి పందేలు జరగనివ్వమని హెచ్చరికలు చేస్తున్నారు. అయితే ప్రతీ సంవత్సరం ఇది మామూలేనని, పోలీసులు హెచ్చరికలు చేయడం చివరి నిమిషంలో అనుమతులు ఇస్తారని నిర్వాహకులు అంటున్నారు. జిల్లాలోని మెట్ట ప్రాంతమైన చింతలపూడి నియోజకవర్గంలోని చింతలపూడి, సీతానగరం, రాఘవాపురం, లింగపాలెం మండలం కొణిజర్ల, ములగలంపాడు, కామవరపుకోట మండలం కళ్లచెరువు, రావికంపాడు, కామవరపుకోట, తడికలపూడి, జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం, లక్కవరం తదితర గ్రామాల్లో ఏటా భారీగా పందేలు నిర్వహిస్తారు. కోట్లాది రూపాయలు చేతులు మారే ఈ జూద క్రీడలో నెమలి, కాకి, పచ్చకాకి, సేతువ, నెమలి, డేగ, కెక్కిరాయి, పెట్టపూరి, కాకి డేగ తదితర రకాల కోళ్లకు డిమాండ్ ఉంటుంది.



పోటీకి తలపడుతున్న పుంజులు (ఇన్‌సెట్‌లో) గాబుల్లో పెంచుతున్న పందెం కోళ్లు

లింగపాలెం: సంక్రాంతి పేరు చెప్పగానే గుర్తు కొచ్చేది కోడి పందేలు. ఏటా సంక్రాంతికి పెద్ద ఎత్తున పందేలు నిర్వహిస్తారు. సంక్రాంతి పండుగకు పిండి వంటలు, కొత్త అల్లుళ్ల కోలాహలం, హరిదాసులు, గొబ్బెమ్మల రంగవల్లులతో గ్రామాల్లో సందడి వాతావరణం కనపడుతుంది. పలుచోట్ల కోడి పందేలు నిర్వహించడానికి పందెం రాయుళ్లు సిద్ధమవుతున్నారు. పందేలు నిర్వహించ కూడదని నిషేధాజ్ఞలు ఉన్నా వాటిని ఎవరూ పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. పోలీసులు జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారే తప్పా అసలు పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉంటున్నాయి. ఒకప్పుడు డెల్టా ప్రాంతంలోనే ఎక్కువగా కోడి పందేలు నిర్వహించేవారు. కానీ నేడు మెట్ట ప్రాంతాల్లో కూడా వాటికి ధీటుగా పందేలు నిర్వహిస్తున్నారు. ఒక్కో పుంజును రూ.20 వేల నుంచి రూ.45 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. పందెం పుంజులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. లింగపాలెం మండలంలో నిర్వహించే కోడి పందేలకు మండల ప్రజలతోపాటు ఇతర జిల్లాల నుంచి పందెం రాయుళ్లు పెద్ద ఎత్తున వస్తారు. ఒక్కో పందెం రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరగనున్నట్లు సమాచారం.

కఠినంగా చర్యలు తీసుకుంటాం



కోడి పందేల నిర్వహణ చట్ట విరుద్ధం. సంక్రాంతి ముసుగులో సర్కిల్ పరిధిలో కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కోడి పందాల నిర్వహణకు ప్రభుత్వం ఎక్కడా అనుమతులు ఇవ్వలేదు. సర్కిల్ పరిధిలో పందెం రాయుళ్లపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నాం. ఇప్పటి వరకు 86 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశాం. ఇప్పటికే సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేశాం.

–సీఐ రవీంద్ర నాయక్, చింతలపూడి సర్కిల్

స్టడీ మెటీరియల్ పంపిణీ

చింతలపూడి: పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ముప్పిడి శామ్యూల్ అన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్ గురువారం మండలంలోని ఎర్రగుంటపల్లి సీతానగరం ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి రూపొందించిన ఈ పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలలతో పాటు హాస్టల్ విద్యార్థులకు కూడా ఈ స్టడీ మెటీరియల్‌ను అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు యు.ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్ టి.సుధాకర్ రావు, రాష్ట్ర అధ్యక్షుడు వి.బాబురావు, జిల్లా కౌన్సిలర్ సత్యనారాయణ, నాగేసు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు శామ్యూల్

పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు



కొయ్యలగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్



పోలవరం రూరల్: పందెం బరిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

కొయ్యలగూడెం: సంక్రాంతి పండుగ మాటున జూద క్రీడలు, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.చెల్లన్నదొర ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు, సచివాలయ మహిళా కానిస్టేబుళ్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన పోలీస్ శాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. నిషేధిత క్రీడలపై చర్యలు తీసుకునే విషయంలో ఉపేక్షించొద్దని సిబ్బందికి సూచించారు. సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని అందుకు స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.

పందెం బరి ధ్వంసం

పోలవరం రూరల్: కోడి పందేలు నిర్వహించేందుకు బరులు ఏర్పాటు చేసే ప్రదేశాలను పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ పరిశీలించారు. పట్టిసీమలో పందేల బరిని గుర్తించి, ధ్వంసం చేశారు. పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

అటవీ ఉత్పత్తులకు నూతన ధరలకు చర్యలు

బుట్టాయగూడెం: గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులకు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) నూతన ధరలను ప్రకటించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జీసీసీ జనరల్ మేనేజర్ కమలాభాయి తెలిపారు. మండలంలోని కేఆర్‌పురం జీసీసీ కార్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జీసీసీ ద్వారా కొనుగోలు చేస్తున్న అటవీ ఉత్పత్తుల వివరాలను ఇన్‌చార్జి సీనియర్ మేనేజర్, డీఎమ్ పార్వతీశ్వరరావు, అకౌంటెంట్ రాజయోగిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో అత్యధికంగా తేనె సేకరణ చేస్తున్నారని ప్రస్తుతం చెల్లించే ధర గిట్టుబాటు కావడం లేదని దానికి అనుగుణంగా ధర కల్పించే విధంగా కృషి చేయాలన్నారు. అలాగే వన్‌దన్ వికాస్ కేంద్రాల్లో గిరిజన మహిళలు అడ్డాకులతో తయారు చేస్తున్న విస్తర్లను కూడా జీసీసీ ద్వారా విక్రయాలు చేస్తున్నామని వాటి నమూనాను ఆమెకు చూపించారు. అనంతరం జీసీసీ అటవీ ఉత్పత్తుల విక్రయాలపై నూతన ధరలకు సంబంధించి కేఆర్‌పురం ఐటీడీఏ డీడీ పీవీఎస్ నాయుడుతో జనరల్ మేనేజర్, డీఎంలు చర్చించారు. కార్యక్రమంలో డీఎం సునీత, తదితరులు పాల్గొన్నారు.



డీడీతో మాట్లాడుతున్న జీసీసీ అధికారులు

వైభవంగా శ్రీవారికి ధనుర్మాస ఉత్సవం

ద్వారకాతిరుమల: క్షేత్రంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాలు శ్రీవారి వైభవాన్ని చాటుతున్నాయి. నిత్యం ఆలయంలో సుప్రభాత సేవకు బదులు, తిరుప్పావై పాశురాలను పఠిస్తున్నారు. అలాగే స్వామివారి గ్రామోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం జరిగిన శ్రీవారి తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ. 1,01,116 లను విరాళంగా అందజేశారు. పట్టాయగూడెంకు చెందిన కోటగిరి వెంకయ్య కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. విరాళాన్ని కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

కనుమ ఉత్సవానికి శరవేగంగా ఏర్పాట్లు

ద్వారకాతిరుమల: కనుమ నాడు కాకైనా కదలదన్నది నానుడి. కానీ ఆరోజు శ్రీవారు క్షేత్రం విడిచి పొరుగు గ్రామానికి వెళతారు. అదే ఇక్కడ విశిష్టత. ఏడాదిలో ఒకసారి మాత్రమే ఇది జరుగుతుంది. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ మరుసటి రోజు కనుమ నాడు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయంగా వస్తుంది. అందులో భాగంగానే ఈ నెల 15న కనుమ పండుగను పురస్కరించుకుని ఈ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు గురువారం పరిశీలించారు.



తొళక్క వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వ్యాయామం, నడక, యోగ, క్రీడల అభివద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు పెన్మెత్స రంగరాజు, మున్సిపల్ కమిషనర్ కె.వి రమణ అన్నారు. జంగారెడ్డిగూడెంలోని అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్‌లో గురువారం ఆరోగ్య అభిలాషల సంక్రాంతి సంబరాలు అంబారాన్నటాయి. సంబరాలను రంగరాజు ప్రారంభించారు. క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు రంగరాజు, మాజీ అధ్యక్షులు గోరింట విజయరామరాజు, కార్యదర్శి నంబూరి రామచంద్రరాజు, కోశాధికారి గొట్టుముక్కల భాస్కరరాజు, మున్సిపల్ కమిషనర్ కె.వి రమణ, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ముదునూరి నరసింహరాజు లను ఘనంగా సత్కరించారు. మండలంలోని పట్టెన్నపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అదే విధంగా లక్కవరం శ్రీ రాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, ఎం.విజయ కృష్ణ, ఉమ, ఆఫీస్ సిబ్బంది అన్నపూర్ణమ్మ, రత్న సిరిలో కుమార్ రాజా పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల: కోలాట నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

దేవస్థానం హైస్కూల్‌లో..

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. హరిదాసు, గోదాదేవి అలంకారాల్లో విద్యార్థులు సందడి చేశారు. వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టి.నరసాపురంలో

టి.నరసాపురం: మండలంలోని పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. టి.నరసాపురం, బొర్రంపాలెం పాఠశాలల్లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఎంఈవో టి.రామ్మూర్తి పాల్గొన్నారు.



టి.నరసాపురం: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



జంగారెడ్డిగూడెం: చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న దృశ్యం

నేడు సంక్రాంతి రంగవల్లుల పోటీ

కొయ్యలగూడెం: సంక్రాంతి సంబరాల నేపథ్యంలో శుక్రవారం వాటర్ ట్యాంకు రామాలయం వద్ద ముగ్గుల పోటీ ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.